క్లుప్తంగా

కర్లపాలెం తహసీల్దార్‌గా వెంకటరత్నం..



కర్లపాలెం: మండల తహసీల్దార్‌గా ఎస్.వెంకటరత్నం గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయం సిబ్బంది మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రైతుల సమస్యలపై దృష్టి సారించి, మెరుగైన సేవలందించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

పీవీ పాలెం తహసీల్దారుగా మెహర్‌కుమార్..



పిట్టలవానిపాలెం: మండల తహసీల్దారుగా మెహర్‌కుమార్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అమర్తలూరు తహసీల్దారుగా పనిచేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు జిల్లాకు వెళ్లి.. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. వీఆర్‌ఓలు, రేషన్ డీలర్లు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

కొల్లూరు తహసీల్దారుగా వెంకటేశ్వర్లు



కొల్లూరు : మండల తహసీల్దారుగా నియమితులైన బొల్లిపల్లి వెంకటేశ్వర్లు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో చెరుకుపల్లి తహసీల్దారుగా పనిచేసిన ఆయన ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు టౌన్ తహసీల్దార్‌గా వెళ్లారు. రెవెన్యూ యంత్రాంగం ఆయనకు పుష్ప గుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపింది.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగేశన



పిట్టలవానిపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు గురువారం పంపిణీ చేశారు. ఖాజీపాలెం గ్రామంలో బాపట్ల ఆర్డీఓ గంధం రవీందర్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. ఆర్డీఓ వెంట బాపట్ల డీఎల్‌డీఓ సువార్త, ఎంపీడీఓ రమణమూర్తి, ఈఓపీఆర్డీ పద్మజ, వీఆర్‌ఓ నాగరాజురెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు డేవిడ్ ఉన్నారు.

ఇసుక లారీ బోల్తా



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు శివారు రెడ్డిపాలెం సెంటర్‌లో ఉన్న టోల్‌గేట్ వద్ద ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. బాపట్ల వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ టోల్‌గేట్ వద్దకు వచ్చే సరికి ఒక్కసారిగా అదుపు తప్పింది. డ్రైవర్ అతి వేగంతో వెళ్లడమే ఇందుకు కారణమని స్థానికులు చెబుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బాపట్లటౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చెరువుజమ్ములపాలెంలో చోటుచేసుకుంది. చెరువుజమ్ముల పాలెం గ్రామానికి చెందిన చెట్టుపల్లి విద్యాసాగర్ జూలై 30న గ్రామంలోని కల్వర్ట్‌పై కూర్చొని మద్యం సేవిస్తున్నాడు. అటువైపుగా వచ్చిన అదే గ్రామానికి చెందిన బొల్లాపల్లి జయరాజు పాత కక్షల నేపథ్యంలో విద్యాసాగర్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన విద్యాసాగర్‌ను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అతను మృతి చెందాడు. రూరల్ సీఐ శ్రీహరి కేసు నమోదు చేశారు.

ధాన్యం డబ్బులు కోసం రైతుల ఆందోళన

రేపల్లె రూరల్: ధాన్యం బకాయి డబ్బులు చెల్లించాలని నియోజకవర్గంలోని పలువురు రైతులు ధాన్యం వ్యాపారి ఇంటి వద్ద గురువారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని ఓ ప్రైవేటు రైస్ మిల్లు యజమాని రాధాకృష్ణమూర్తి 2018లో రైతుల వద్ద నుంచి 8,320 బస్తాల ధాన్యం కొనుగోలు చేసి, అప్పటి నుంచి రైతులకు డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. వ్యాపారి బంధువైన డీఎస్పీ ధనుంజయరావు అండదండలతో రూ.కోటి వరకు ధాన్యం డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గంలోని ఆముదాలపల్లి, అడవులదీవి, గుర్నాథ్ నగర్, కట్టవ, ఉల్లిపాలెం, పేటేరు, తదితర గ్రామాల నుంచి పలువురు రైతులు వ్యాపారి ఇంటి వద్ద ఆందోళనలకు దిగటంతో సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ నజీర్ బేగ్, ఎస్ఐ హరిబాబు రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పటంతో రైతులు డీఎస్పీ మురళీకృష్ణ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేశారు.

తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికం

నగరం: తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని.. బిడ్డకు తప్పనిసరిగా తల్లి పాలు అందించాలని ధూళిపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రెబ్బా జాన్ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని ధూళిపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల అవశ్యకతపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. బిడ్డ పుట్టిన అరగంట వ్యవధిలో పాలు తాగించాలని తెలిపారు. తల్లి పాలు తాగిన పిల్లలు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. సీహెచ్‌వో బాబురావు, సూపర్‌వైజర్ టి.కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



దూళిపూడిలో జరిగిన ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ రెబ్బా జాన్ ప్రసాద్

తల్లి పాలతో బిడ్డ ఆరోగ్యం సురక్షితం

కొల్లూరు : చిన్నారుల ఆరోగ్య సురక్షితంగా ఉండాలంటే తల్లి పాలతోనే సాధ్యమని ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొల్లూరు టౌన్ చర్చి ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లి పాలలో ఉండే రోగ నిరోధక శక్తి కారణంగా పాలు తాగిన పిల్లల్లో ఎదుగుదల సక్రమంగా ఉండటంతోపాటు ఆరోగ్య వంతంగా ఉంటారన్నారు. తొలుత గర్భిణులు, బాలింతలతో తల్లి పాలను బిడ్డలకు అందజేస్తామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నీరజ, వనజ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రు పాలు శ్రేష్ఠం

పెనుగుదురు పాడు(వేమూరు) : తల్లి పాలు అమృతం కన్నా మిన్న అని, ప్రసవించిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలని వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ పాలె కోటేశ్వరరావు అన్నారు. చండూరు మండలంలోని పెనుగుదురుపాడు గ్రామంలో తల్లి పాల వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, టి.తిరుమల, ఆశ కార్యకర్త ఎ.గీతారాణి, మహిళా పోలీసు భువనేశ్వరి పాల్గొన్నారు.



పెనుగుదురు పాడు గ్రామంల్లో తల్లి పాల వారోత్సవాల్లో కోటేశ్వరరావు



కొల్లూరులో ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు, బాలింతలు

నీరు లేని నారుమడి

చెరుకుపల్లి: ఖరీఫ్ సీజను మొదలైనప్పటి నుంచి రైతులను సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. సకాలంలో నారు పోసుకునే సమయంలో ఎడతెరిపి లేని వర్షాలు పడ్డాయి. నారుమళ్లు పోసి 10 నుంచి 15 రోజులు కావస్తున్నా.. సాగునీరు సకాలంలో అందక వరి నారుమళ్లు ఎండి పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి రోజు జలాశయాల నుంచి వరద నీరు వస్తున్నా.. సముద్రం పాలు చేస్తున్నరేగాని రైతుల గురించి పట్టించుకున్న నాథుడే లేడని రైతులు బాహాటంగా విమర్శిస్తున్నారు. మండలంలోని చెరుకుపల్లి, గుళ్ళపల్లి, పోన్నపల్లి, ఆరుంబాక, తూర్పుపాలెం తదితర గ్రామాల్లో సాగు నీటి కాలువలకు నీరు అర కొరగా వస్తున్నాయి. కాలువల పక్కనే పొలాలు ఉన్నారు.. కొందరు రైతులు ఇంజన్ల సాయంతో పొలాలు తడుపుకుంటున్నారు. దూరంగా ఉన్న పొలాలకు రెండు లేదా మూడు వందల అడుగులు ట్యూబులు వేసుకుని నీరు పెడుతున్నారు. దీంతో గ్రామాల్లో చిన్న ఇంజన్లకు డిమాండ్ మరింత పెరిగింది. అధికారులు సకాలంలో సాగు నీటిని విడుదల చేసి వరినారుమళ్లు కాపాడాలని రైతులు కోరుతున్నారు.



గుళ్లపల్లిలో సాగునీరు అందక ఎండిపోతున్న వరి నారుమడి

పోస్టల్ ఉద్యోగి మనోజ్ వర్మను పోలీస్ కస్టడీలోకి తీసుకోవాలి

నగరం: సిరిపూడి పోస్టాఫీసులో పేద ప్రజలు దాచుకున్న సొమ్మును తిరిగి ఇప్పించాలని గురువారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిక్కాల మణిలాల్ డిమాండ్ చేశారు. మండలంలోని సిరిపూడి పోస్టాఫీసు వద్ద పోస్టల్ బాధితుల పోరాటక మిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరం ఎస్ఐ కోటేశ్వరావు విచారణ నిమిత్తం పోస్టాఫీసుకు వెళ్లడంతో బాధితులు, సీపీఎం నాయకులు పోస్టల్ ఉద్యోగిని పోలీస్ కస్టడీలోకి తీసుకోవాలని కోరారు. అనంతరం మణిలాల్ మాట్లాడుతూ పేద ప్రజలను మోసం చేసి కోర్టులో లొంగిపోయిన పోస్టల్ ఉద్యోగి ఓడుగు గోపీ మనోజ్ వర్మను పోలీస్ కస్టడీలోకి తీసుకుని బాధితులకు తగిన న్యాయం చేయాలన్నారు. సుమారు 700 మంది ఖాతాదారుల దాచుకున్న రూ.60లక్షల సొమ్మును మనోజ్ వర్మ స్వాహా చేశాడన్నారు. పోస్టాఫీసులో డబ్బుల దాచుకున్న కొంతమందికి పోస్టల్ పుస్తకాల నగద వివరాలను జమ చేయలేదని, దీనివల్ల డబ్బుల కట్టిన వారికి అన్యాయం జరుగుతుందన్నారు. పేద ప్రజల సొమ్మును తిరిగి ఇప్పించే వరకు పోరాటం చేస్తామన్నారు. మనోజ్‌వర్మను పోలీస్ కస్టడీలో తీసుకుని వాస్తవాలను వెలికితీసి, అతను స్వాహ చేసిన సొమ్మును బాధితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి గోని, కోటేశ్వరావు, మల్లేశ్వరి, జ్యోతి, అంజలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మణిలాల్

భట్టిప్రోలులో 95.09 శాతం పింఛన్లు పంపిణీ

భట్టిప్రోలు: మండలంలో గురువారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో 2వ నెల కూడా సచివాలయ సిబ్బంది, అధికారుల చేత పింఛన్లు పంపిణీ చేయించారు. పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని జిలుగువారిపాలెంలో దివ్యాంగుడు యశ్వంత్‌కి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి డిజిటల్ అసిస్టెంట్ పూర్ణాతో కలసి రూ. 5 వేలు పింఛన్ అందజేశారు. వల్లెకోనలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు పింఛను నగదు పంపిణీ చేశారు. తహసీల్దారు మేకా శ్రీనివాసరావు, ఎంపీటీసీ దున్నా తిరుపతిబాబు, మాజీ సర్పంచ్‌లు ప్రసాదరావు, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటల సమయానికి మండలంలోని 12 సచివాలయాల పరిధిలో 8,604 మంది పింఛన్‌దారులకు 8,177 పింఛన్లు (95.09 శాతం) పంపిణీ చేశారు.

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో సచివాలయ సిబ్బంది గురువారం పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 15వ వార్డులో మంత్రి అనగాని సోదరుడు శివప్రసాద్, 23వ వార్డులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 9,990 మంది పెన్షన్‌దారులు ఉండగా తొలిరోజు సాయంత్రం 6 గంటలకు 9,799 మందికి పింఛన్లు (98.09 శాతం) అందజేశామన్నారు. రేపల్లె పట్టణంలో 4,445 మందికి గాను 4336 మందికి (97.55 శాతం) పంపిణీ జరిగిందని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి చెప్పారు. మిగిలిన వారికి గురువారం అందజేస్తామన్నారు.



పింఛను నగదు అందజేస్తున్న టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్

చెరుకుపల్లిలో 96 శాతం..

చెరుకుపల్లి: మండలంలో గురువారం 96.75 శాతం పెన్షన్లు పంపిణీ జరిగినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ మూర్తి తెలిపారు. 16 పంచాయతీల్లో 10,037 మంది లబ్ధిదారులకుగాను 9,711 మందికి పంపిణీ చేశామన్నారు. జెడ్పీ సీఈవో వసంత రాయుడు గుళ్ళపల్లి పంచాయతీలో పింఛన్లు పంపిణీ చేశారు.



పెరవలిపాలెంలో పింఛను నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

మండల ప్రత్యేక అధికారి తమ్మాజీరావు, తహసీల్దారు సీహెచ్ పద్మావతి, ఎంఈవోలు టి.నవీన్‌కుమార్, పులిలాజర్. ఏఓ టి. బాలాజీ గంగాధర్, ఈవోపీఆర్డీ విజయబాబు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తాం

పెరవలి పాలెం(వేమూరు): మండలంలోని పెరవలిపాలెం, అమర్తలూరు మండలంలోని పెదపూడి గ్రామంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. పెరవలి పాలెంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం జరుగుతందన్నారు. విజయబాబు, ఊస రాజేష్, సీతారామయ్య, కృష్ణ మూర్తి, చిన్న, నాగేశ్వరరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఈఎల్‌సీ ఆవిర్భావ దినోత్సవాలు

భట్టిప్రోలు: ఆంధ్ర సౌవార్తిక లూథరన్ సంఘం 183వ ఆవిర్భావ దినోత్సవం (గాస్పెల్ డే)ను గురువారం భట్టిప్రోలు క్రీస్తు లూథరన్ దేవాలయం, రైలుపేట పరిశుద్ధ మార్క్ లూథరన్ దేవాలయంలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ ఆధ్వర్యంలో ఆంధ్ర సౌవార్తిక లూథరన్ సంఘం వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ జాన్ క్రిష్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్‌ను స్మరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా లూథరన్ లోగో జెండాను ఏఈఎల్‌సీ సెక్రటరీ సినడు, చిన్నం కిషోర్‌బాబు ఆవిష్కరించారు. అమెరికా నుంచి మొదటి లూథరన్ మిషనరీగా వచ్చి దేశంలోని ఏపీలోని గుంటూరులో అడుగు పెట్టిన మొదటి సువార్త దినంను ఏఈఎల్‌సీ జన్మదినంగా ఆచరిస్తామని రవీంద్ర వర్మ తెలిపారు. సంఘస్తులు మంద్రు సునీల్-మాధవి కుటుంబ సభ్యులు విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్యారిస్ డెలిగేట్ పీసీసీ, సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్, చిల్డ్రన్, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సెక్రటరీ సినడు

సంక్షేమ పథకాల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

రేపల్లె సబ్ కలెక్టర్ హేలా షారోన్

కొల్లూరు : ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా చిత్తశుద్ధితో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని రేపల్లె సబ్ కలెక్టర్ హేలా షారోన్ అన్నారు. గురువారం కొల్లూరులో ఆమె నిత్యావసర సరకుల పంపిణీ, ఫించన్ల పంపిణీ తీరును పరిశీలించి, లబ్ధిదారులకు పింఛను సొమ్ము, బియ్యం అందజేశారు. ఫించన్లను ప్రతి నెలా మొదటి రోజే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీ వాహన నిర్వాహకులు ప్రతి రోజు 200 మంది కార్డుదారులకు రేషన్ అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీ కుమారి, డీటీ నిరంజన్, ఆర్ఐ త్రివేణి పాల్గొన్నారు.



కొల్లూరు స్నానాల రేవు ప్రాంతంలో పింఛను నగదు అందజేస్తున్న సబ్ కలెక్టర్ హేలా షారోన్

పట్టపగలు ఇంటిలో చోరీ

కొల్లూరు: పట్ట పగలే ఓ ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని చిలుమూరులో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. చిలుమూరుకు చెందిన నాగిశెట్టి నాగలక్ష్మి భర్త మరణించడంతో తన కుమార్తెను చదివించుకుంటూ జీవనం సాగిస్తోంది. గురువారం ఆమె పొలం పనికి వెళ్లగా, కుమార్తె పాఠశాలకు వెళ్లింది. పాఠశాల నుంచి వచ్చిన కుమార్తె.. ఇంటి తలుపు తాళం పగలగొట్టి ఉండటం గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగలగొట్టి దుస్తులు చిందరవందరగా పడేసి ఉండటంతో తల్లికి ఫోన్ ద్వారా సమాచారం అందించింది. ఇంటికి వచ్చి పరిశీలించిన నాగలక్ష్మి బీరువాలో దాచి ఉంచిన సుమారు రూ.80 వేలు విలువ చేసే నగదు, బంగారు పోగులు అపహరణకు గురైనట్లు గుర్తించింది. 100 నంబరుకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించింది. కొల్లూరు పోలీసులు చోరి జరిగిన ఇంటిని పరిశీలించారు. పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి, విచారణ జరుపుతున్నారు.



పగలగొట్టిన బీరువా

అధ్యాపకుడు కలాంకు డాక్టరేట్



బాపట్ల: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడు షేక్ అబ్దుల్ కలాంకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై ఆయన సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి డాక్టరేటు అందజేశారు. ఆర్ట్స్ కళాశాల రిటైర్డు కామర్స్ రీడర్ డాక్టర్ పి.సి సాయిబాబు పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధన చేశారు. కలాంకు డాక్టరేట్ డిగ్రీ సర్టిఫికేట్‌ను గురువారం బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు అందించారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమణారావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. డాక్టర్ సాయిబాబు ఇప్పటి వరకు తొమ్మిది మంది డాక్టరేట్‌లను అందించారు.

మత్స్య సాగుతో అధిక లాభాలు

చెరుకుపల్లి: మత్స్య సాగుబడిలో లాభాలు పొందవచ్చని రాంబొట్లవారిపాలెం మత్స్య సహకురాలు సబియా పేర్కొన్నారు. రాంబొట్లపాలెం రైతు భరోసా కేంద్రంలో ఆక్వా రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా గుడ్ వాటర్ క్వాలిటీ మేనేజ్మెంట్‌పై అవగాహన కల్పించారు. మత్స్య శాఖ అధికారి జె.మహిజ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పుపై హర్షం

కొల్లూరు : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అనుకూలంగా దేశ సర్వోన్నత న్యాయస్థానంలో తీర్పు వెలువడటంపై ఎమ్మార్పీఎస్ శ్రేణుల్లో హర్షం వ్యకమైంది. సుప్రీం కోర్టు తీర్పు అనంతరం కొల్లూరు ప్రధాన రహదారిలో ఎంపీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. బాణ సంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు.



ఎంపీఆర్పీఎస్ మద్దతుదారుల ప్రదర్శన

వర్గీకరణకు అనుమతి అభినందనీయం

రేపల్లె రూరల్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పునివ్వటం హర్షణీయమని హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిలర్ పీపుల్స్ టీమ్ సభ్యులు ఎన్.చంద్రశేఖర్‌బాబు, పిన్నిసాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో అన్ని రంగాల్లో సముచిత స్థానం లభిస్తుందన్నారు.

4న పద్మశాలీయ విద్యార్థులకు పారితోషకాలు

రేపల్లె రూరల్: ఇంటర్మీడియట్, 10వ తరగతిలో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన పద్మశాలీయ విద్యార్థులకు పట్టణంలోని నయాగరా ఫంక్షన్ హాలులో ఈ నెల 4న ఉదయం 10 గంటలకు పద్మశాలీయ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగదు పారితోషక ప్రధానోత్సవం, ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, సంఘ సభ్యులు, పద్మశాలీయులు పాల్గొనాలని కోరారు.

ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించాలి

రేపల్లె రూరల్: సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కె.సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీలోపు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలు నిర్వహించాలని, అనంతరం కమిటీ సభ్యుల నివేదికను మండల విద్యావనరుల కేంద్రంలో అందించాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కొల్లూరు : ఇసుక అక్రమ రవాణా చేస్తూ గ్రామస్తులు అడ్డగించిన ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు కొల్లూరు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని రావికంపాడులో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లు ప్రమాదకరంగా వెళుతుండటంతో స్థానికులు అడ్డగించి, పోలీసులకు సమాచారం అందించారు. కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి ఘటనా ప్రాంతానికి చేరుకొని ఆందోళనకు దిగిన స్థానికులకు సర్దిచెప్పి ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి, తెనాలి కోర్టుకు పెట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

సోషల్‌మీడియా దుష్ప్రచారంపై కేసు నమోదు

కొల్లూరు : సోషల్ మీడియా వేదికగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి లోకేష్‌లపై దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు కొల్లూరు పోలీసులు గురువారం తెలిపారు. కొల్లూరు ఎస్సీ ప్రాంతానికి చెందిన కొండూరు సురేష్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ప్రజా ప్రతినిధులపై అభ్యంతరకర పోస్టులు పెడుతున్న సోషల్ మీడియా అకౌంట్ దారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళి

వేమూరు: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇస్తూ.. సుప్రీం కోర్టు తీర్పునిచ్చినట్లు కైతేపల్లి షాలేం రాజు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రం బస్టాండ్ సెంటరులో బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ చేసిన త్యాగం మరువు లేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పచ్చిగళ్ల అనిల్, యల్లమాటి రాజేంద్ర, పందెల సురేష్, కూచిపూడి సుబ్బారావు, అరమళ్ల దేవ, ఎలిచర్ల గోపయ్య, తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నేత నివాళి

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఖాతా ఖాళీ

- స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌తోనే సైబర్ నేరాలకు కట్టడి
- ఎస్పీ తుషార్‌డూడి

బాపట్లటౌన్: పాస్‌వర్డ్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఖాతాలోని సొమ్ము మొత్తం ఖాళీ అవుతుందని ఎస్పీ తుషార్ డూడి హె ఎస్పీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇంటర్నెట్ బ్యాంoooooకింగ్, యూపీఐ (ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం) వాడే సమయంలో పాస్‌వర్డ్‌ల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. తేలికైన పాస్‌వర్డ్ పెట్టుకుంటే సైబర్ కేటుగాళ్ల చేతికి తాళాలు మనమే ఇచ్చినట్లు అవుతుందన్నారు. గూగుల్, ఫేస్‌బుక్, జీమెయిల్, ఇన్‌స్టాగాం, ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ ఇలా అన్నింటికీ సంబంధించిన పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోవడం చాలా కష్టమని భావించి అన్నింటికీ ఒక్కటే పాస్‌వర్డ్ పెట్టుకుంటున్నారని అలా చేయొద్దన్నారు. ఒక్కదాని పాస్‌వర్డ్‌ల తెలిస్తే అన్ని ఖాతాల గుట్టు సైబర్ కేటుగాళ్ల చేతికి చిక్కుతుందన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

గణపవరం(కర్లపాలెం): ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. గణపవరం పంచాయతీ చినపులుగువారి పాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహం దగ్ధమైన కుటుంబ సభ్యులకు మాజీ సైనికుల సంక్షేమ సంఘం నుంచి రూ.20వేల నగదు అందజేశారు. రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో అగ్ని ప్రమాద భాదితులకు రూ.4వేల నగదు నిత్యావసర సరుకులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర సంఘం అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి, సర్పంచ్‌లు పిట్టు నాగాంజనేయులురెడ్డి, ఆట్ల అయ్యప్పరెడ్డి, ఉప సర్పంచ్‌లు వెంకటేశ్వరరెడ్డి, రవికుమార్, మాజీ సైనికులు ఆదిశేషారెడ్డి, శేష గిరిరావు, రజాక్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సైనికులు